సాక్షి రంగారెడ్డి

గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



లారీ, ట్రాక్టర్ ఢీ

నేషనల్ హైవేపై ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయిన లారీ.. అదుపు తప్పి అదే ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. 8లో▸



తిరుగులేని శక్తిగా..

సిమెంట్ రంగంలో తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్ ఎదిగిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ తెలిపారు. 8లో▸



పోదాం పోలేపల్లి

వికారాబాద్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పోలేపల్లి రేణుకా ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. 8లో▸

న్యూస్‌రీల్

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎంపీ డీకే అరుణ



శివాజీ జయంతి వేడుకల్లో ఎంపీ

కొందుర్గు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దైవ మార్గంలో నడుచుకోవాలని సూచించారు. యువత దురలవాట్లకు చేరువ కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, వారిలో భక్తి భావం పెంపొందించేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి, నాయకులు మహేందర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, శివారెడ్డి, మోహన్ సింగ్ పాల్గొన్నారు.

‘ఫ్యూచర్’ భద్రతకు ఠాణా ఏర్పాటు

స్థలం పరిశీలించిన డీసీపీ సునీతారెడ్డి



స్థలం పరిశీలిస్తున్న డీసీపీ

యాచారం: ఫ్యూచర్ సిటీ భద్రతను దృష్టిలో పెట్టుకుని కొత్తగా పోలీస్‌స్టేషన్ నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి తెలిపారు. ఇందుకు మర్లకుంటతండా సమీపంలోని 330 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పక్కనే టీజీఐఐసీకి చెందిన మూడు ఎకరాల స్థలంలో ‘హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ’ పేరుతో ఠాణా ఏర్పాటు చేయనుందని పేర్కొన్నారు. బుధవారం ఆమె.. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజుతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏ మార్గం గుండా వెళ్తోంది. ప్రస్తుతం నిర్మించే ఠాణా పక్కనుంచి పీఎస్ పరిధిలోని గ్రామాలకు రోడ్డు ఏ విధంగా ఉంటుంది. కొత్త రహదారుల ప్రతిపాదనలు ఏమైనా ఉన్నాయా అని తదితర విషయాలను టీజీఐఐసీ, పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తేజంరెడ్డి తదితరులు ఉన్నారు.

శనివారాల్లో ‘ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం’

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు



లక్డీకాపూల్: ఆస్తి పన్ను సమస్యల పరిష్కారం కోసం ‘ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం’ (పీటీపీ) కార్యక్రమాన్ని ఈ నెల 22 నుంచి మార్చి 29 వరకు ప్రతి శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సర్కిల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి తెలిపారు. గ్రేటర్ పరిధిలోని ప్రజలకు ఆస్తిపన్ను సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ‘ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కారం’ (పీటీపీ) నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పన్ను సమస్యలు, పునఃసమీక్ష అభ్యర్థనలు (ఆర్పీఎస్) ఆస్తిపన్ను అంచనాల్లో సవరణలు, బిల్ కలెక్టర్ల ద్వారా/ఆర్టీజీఎస్ ద్వారా చెల్లింపుల నమోదు, ఆన్‌లైన్ బకాయిలు సరిచేయడం, కోర్టు కేసుల పరిష్కారం, ఐజీఆర్ఎస్ సమస్యలు, స్వయం మూల్యాంకనం (సెల్ఫ్ అసెస్ మెంట్) తదితరాలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రాపర్టీ ట్యాక్స్ పరిష్కార కార్యక్రమం ఈ నెల 22న, మార్చి 1, 8, 15, 22,29 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు డిప్యూటీ కమిషనర్స్ కార్యాలయాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆస్తిపన్నుకు సంబంధించిన ఏవైనా సమస్యలున్న వారు తమ సంబంధిత జీహెచ్ ఎంసీ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో పైన పేర్కొన్న తేదీలలో నిర్వహించే ప్రాపర్టీ టాక్స్ పరిష్కారం కార్యక్రమంలో సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలని కమిషనర్ సూచించారు.

భానుడు భగభగ.. మీటర్ గిరగిరా!

పగటి ఉష్ణోగ్రతలు 35.7 డిగ్రీలు



భానుడు భగ్గుమంటున్నాడు. తాజాగా పగటి గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35.7 డిగ్రీలు నమోదు కాగా.. ఎండ తీవ్రతకు ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీలు, కూలర్లకు పనిచెప్పారు. దీంతో విద్యుత్ డిమాండ్ అమాంతం పెరిగింది. సగటున విద్యుత్ డిమాండ్ 60 మిలియన్ యూనిట్లు నమోదు కాగా.. అది తాజాగా 70ఎంయూను దాటింది.

గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ ఇలా

తేదీ	మెగావాట్లు	మిలియన్ యూనిట్లు
10	3310	66.33
11	3365	67.09
12	3437	69.18
13	3455	69.04
14	3353	68.08
15	3203	64.87
16	2899	60.06
17	3358	66.07
18	3423	70.01

- ఉక్కపోతతో ప్రజలు విలవిల
- ఆన్ అయిన ఏసీలు, కూలర్లు
- పెరిగిన విద్యుత్ వినియోగం
- సగటున 70 మిలియన్ యూనిట్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎండలు మండిపోతున్నాయి. గ్రేటర్‌లో బుధవారం పగటి గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35.7 డిగ్రీలు, కనిష్ఠంగా 21.3 డిగ్రీలు నమోదయ్యాయి. ఈ ఉష్ణోగ్రతలకు ఉక్కపోత తోడవడంతో ఉపశమనం కోసం ప్రజలు ఏసీలను ఆన్ చేస్తున్నారు. మొన్నటి వరకు మూలన పడిన కూలర్లు మళ్లీ వినియోగంలోకి వస్తున్నాయి. ఇంట్లోనే కాదు వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో రోజంతా ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు ఆన్‌లో ఉండటంతో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరుగుతోంది. ఫిబ్రవరి మొదటి రెండో వారం వరకు గ్రేటర్‌లో రోజు సగటున డిమాండ్ 60 మిలియన్ యూనిట్లు నమోదు కాగా, తాజాగా 70 ఎంయూ దాటింది.

అత్యవసరమైతేనే.. ఎల్సీలకు అనుమతి

విద్యుత్ వాడకం పెరుగుతున్న నేపథ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఇంజినీర్లలో ఆందోళన మొదలైంది. వేసవిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం డిస్కం ముందస్తు లైన్ల పునరుద్ధరణ చర్యలు చేపట్టింది. లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, డీటీఆర్‌లలో ఆయిల్ లీకేజీల నియంత్రణ చర్యలు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, లూజు లైన్లను సరి చేయడం, దెబ్బతిన్న ఇన్సులేటర్లను మార్చడం, ఎర్తింగ్ సిస్టం పక్కగా ఉండేలా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం సబ్‌స్టేషన్ల మధ్య ఇంటర్ లింకింగ్ వర్క్స్ నిర్వహిస్తుంది. వారం పది రోజుల్లో వీటిని కూడా పూర్తి చేయనుంది. మార్చి మొదటి వారంలో ఇంటర్మీడియట్, రెండో మూడో వారంలో టెన్త్ వార్షిక పరీక్షలు మొదలు కానున్నాయి. విద్యార్థుల చదువుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లైన్ క్లియరెన్స్ (ఎల్సీ)లకు స్వస్తి చెప్పింది. అత్యవసరమైతే తప్ప.. ఎల్సీలకు అనుమతి ఇవ్వడం లేదు.

ఫిబ్రవరిలోనే.. ఏప్రిల్ డిమాండ్

మార్చి, ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. కానీ 2022 ఏప్రిల్ నెలలో నమోదైన సగటు గరిష్ఠ (3435 మెగావాట్లు)డిమాండ్.. ప్రస్తుతం ఫిబ్రవరిలోనే(3455 మెగావాట్లు) నమోదవుతోంది. ఇక మార్చి, ఏప్రిల్ నెలలో డిమాండ్ ఎంత పెరుగుతుందో అనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. మే చివరి నాటికి రోజు సగటు డిమాండ్ 100 ఎంయూలు దాటే అవకాశం ఉన్నట్లు డిస్కం అంచనా వేస్తోంది.

ప్రత్యామ్నాయ మార్గాలకు ప్రణాళికలు

60 శాతానికి మించి లోడు ఉన్న 33కేవీ, 11 కేవీ ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి, ప్రత్యామ్నాయ మార్గాలకు విద్యుత్ పంపిణీ సంస్థ ప్రణాళికలు రూపొందించింది. ప్రస్తుతం 571 (33కేవీ) సబ్‌స్టేషన్లు ఉండగా, వీటి సామర్థ్యం 9,675 ఎంవీఏగా ఉంది. కొత్తగా మరో 213(33/11 కేవీ) సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు గ్లోబల్ టెండర్లు పిలిచింది. పనులు చేసేందుకు ముందుకు వచ్చే కాంట్రాక్టర్లకు ఆయా సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు అప్పగించి, నిర్దేశిత లక్ష్యం లోగా వాటిని పూర్తి చేయించాలని డిస్కం నిర్ణయించింది. అంతే కాదు కొత్తగా నాలుగు వేల కిలో మీటర్ల 33 కేవీ లైన్లు, ఏడు వేల కిలో మీటర్ల 11 కేవీ లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సీఎండీ ముషారఫ్ ఫరూఖీ రోజూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఎస్ఈలు, సీజీఎంలు, డీఈలతో సమావేశాలు ఏర్పాటు చేసి, లైన్ల పునరుద్ధరణ, కొత్త లైన్ల ఏర్పాటు వంటి పనులను సమీక్షిస్తున్నారు. ముఖ్యంగా నిజాంపేట, బాచుపల్లి, కూకట్‌పల్లి, గండి మైసమ్మ, అమీన్‌పూర్‌లలో నమోదవుతున్న విద్యుత్ డిమాండ్, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రూ.212.20 కోట్లతో బౌరంపేటలో కొత్తగా నిర్మించిన 220/132 కేవీ సబ్‌స్టేషన్‌ను ఈ నెలాఖరు లోగా ఛార్జ్ చేయనున్నారు.

ఫైళ్ల పెండింగ్‌పై సీఎండీ సీరియస్

సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, మేడ్చల్ సర్కిళ్ల పరిధిలో కొత్త కనెక్షన్ల జారీకి సంబంధించిన ఫైళ్లు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటాన్ని సీఎండీ ఫారూఖీ సీరియస్‌గా తీసుకున్నారు. బుధవారం ఉదయం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయా సర్కిళ్ల అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఆయా కనెక్షన్లను ఎందుకు పెండింగ్‌లో పెట్టాల్సి వచ్చిందని నిలదీసినట్లు తెలిసింది. నిర్దేశించిన గడువులోగా కనెక్షన్లు జారీ చేయాలని ఆదేశించారు. ఎన్నిసార్లు హెచ్చరించినా సైబర్‌సిటీ, రాజేంద్రనగర్ సర్కిళ్ల పరిధిలోని కొంత మంది ఇంజినీర్లు తీరు మార్చుకోవడం లేదని, పరిస్థితిలో మార్పు రాకపోతే ఉపేక్షించబోమని హెచ్చరించినట్లు తెలిసింది.

నేల‘పాలు’



పాలు పారబోసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మదర్ డెయిరీ సంస్థ నిర్వాకం వలన పాడి రైతులు గోస పడుతున్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో.. డబ్బుల కోసం అధికారులను ప్రాధేయ పడుతున్నారు. అయినా స్పందన కానరాకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పాలను పారబోసి చేసి నిరసన తెలిపారు.

- రెండు నెలలుగా అందని పాల బిల్లులు
- స్పందించని డెయిరీ యాజమాన్యం
- ఆందోళన వ్యక్తంచేసిన రైతులు
- దాణా కొనలేక పోతున్నామంటూ ఆవేదన

యాచారం: మండల పరిధి కుర్మిద్ద గ్రామంలో 90 మంది రైతులు 25 ఏళ్లుగా మదర్ డెయిరీకి పాలు పోస్తున్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం రెండు పూటలా 1,700 లీటర్ల పాలను సంస్థకు విక్రయిస్తున్నారు. నాణ్యతను బట్టి గేదె పాలు లీటరు రూ.46, ఆవు పాలు లీటరుకు రూ.31 వరకు సంస్థ చెల్లిస్తుంది. ఇదిలా ఉండగా.. ఆరు నెలలుగా రైతులకు డెయిరీ యాజమాన్యం సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు.

రూ.45 లక్షలకు పైగా..

గతేడాది డిసెంబర్, ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెల బిల్లులు రూ.45 లక్షలకు పైగానే అందాల్సిన ఉంది. వారం క్రితం బిల్లుల పెండింగ్‌పై రైతులు గ్రామంలోని మదర్ డెయిరీ సంస్థ కేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. చైర్మన్ మహేందర్‌రెడ్డిని నిలదీశారు. ఇదే విషయాన్ని చైర్మన్ సంస్థ ఉన్నతాధికారులకు తెలిపారు. బిల్లులు అందజేయాలని కోరారు. అయినప్పటికీ.. సంస్థ నుంచి స్పందన లేకపోవడంతో బుధవారం డెయిరీ ఎదుట పాలు పారబోసి నిరసన వ్యక్తంచేశారు. పశువులను సాకడం కోసం రూ.వేలు ఖర్చు చేసి దాణా, పశుగ్రాసం కొనుగోలు చేసి, నెల మొత్తం కష్టపడితే బిల్లులు చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. పశు పోషణతో పాటు కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. రెండు, మూడు రోజుల్లో బిల్లులు మొత్తం చెల్లించాలని, లేని పక్షంలో నల్గొండ జిల్లాలో ఉన్న మదర్ డెయిరీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

రూ.లక్షన్నర రావాలి



మదర్ డెయిరీకి నిత్యం 60 లీటర్ల పాలను విక్రయిస్తాను. నెలకు రూ.70 వేల బిల్లు అందాల్సి ఉంది. రెండు నెలల నుంచి బిల్లు రావటం లేదు. రూ.లక్షన్నరకు పైగా ఆగిపోయింది. నెలనెలా డబ్బులు రాకపోవడంతో పశుదాణా, గ్రాసం ఖర్చులు, కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది.

– గొట్టె అంజయ్య, రైతు కుర్మిద్ద

ఇబ్బంది పెడుతున్నారు



రెండు నెలలుగా సంస్థ రైతులకు బిల్లులు చెల్లించడం లేదు. మొత్తం రూ.45 లక్షలకు పైగా రావలసి ఉంది. రైతులు పదేపదే అడుగుతున్నారు. ఇబ్బంది పెడుతున్నారు. 25 ఏళ్లుగా వారు పాలు పోస్తున్నారు. కానీ ఎప్పుడూ ఇలా జరగలేదు. ఆరు నెలలుగా బిల్లుల చెల్లింపులో యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోంది.

– మహేందర్‌రెడ్డి, డెయిరీ చైర్మన్, కుర్మిద్ద

దేశానికే ఆదర్శం మన పల్లెలు




బీహార్ ప్రజాప్రతినిధులు, అధికారులతో లక్ష్మీనర్సింహారెడ్డి

- సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి
- జీపీల అభివృద్ధిపై బీహార్ ప్రజ్రాతినిధులు, అధికారులకు అవగాహన

కద్తాల్: పల్లెప్రగతితో తెలంగాణ పల్లెలు ఎంతో అభివృద్ధి చెందాయని, దేశానికే మన గ్రామాలు ఆదర్శంగా నిలిచాయని సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ జాతీయ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థలో బీహార్ ప్రజాప్రతినిధులు, అధికారులకు రాష్ట్రంలోని గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన.. గత పంచాయతీ పాలకవర్గంలో.. జీపీల అభివృద్ధి, సమస్యలు, సొంత ఆదాయ వనరుల పెంపు, పల్లెప్రగతి ద్వారా చేపట్టిన పనుల గురించి తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్లు, పల్లె ప్రకృతి వనం, ఇంకుడు గుంతలు, తడిపొడి చెత్త వేరుచేసే విధానం, రైతు వేదికలు, వైకుంఠధామాల నిర్మాణం తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. సమష్టి నిర్ణయాలతో పల్లెలు అభివృద్ధిలో ముందున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా బీహార్ ప్రతినిధులు సంతృప్తి చెందారని, అభినందించి ప్రసంశించారని నర్సింహ్మారెడ్డి తెలిపారు. సమావేశంలో బీహార్ ప్రజాప్రతినిధులు, అధికారులు ముఖేశ్‌సింగ్, స్మితా వర్మ, సంజయ్‌కుమార్, ఊర్మిలదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఎడ్యుకేషన్ మంత్రిని నియమించాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్



మాట్లాడుతున్న ప్రణయ్

షాద్‌నగర్‌రూరల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విద్యార్థి నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం విమర్శించారు. వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సకాలంలో ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు అద్దెలు చెల్లించలేక, సెమిస్టర్ పరీక్షలు నిర్వహించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని పేర్కొన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఆర్తిక్, ఉపాధ్యక్షులుగా సుమయిర్, శివశంకర్, కార్యదర్శిగా శ్రీకాంత్, సహాయ కార్యదర్శులుగా ఓంకార్, శివసాయి, గిరిధర్, సభ్యులుగా యశ్వంత్, ఆదిల్, ఆఫ్సన్, సల్మాన్, నెహ్రూ, వినయ్, అశోక్, సమీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన సభ్యులను ప్రణయ్ అభినందించారు.

దళితవాడకు దారి!

దేవరయాంజాల్‌లో ప్రహరీ తొలగించిన హైడ్రా

సాక్షి, సిటీబ్యూరో: ఓ కాలనీ వెంచర్ నిర్వాహకులు దళితవాడకు వెళ్లే దారిని మూసేశారు. దీనిపై బాధితుడు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీని (హైడ్రా) ఆశ్రయించారు. దీని పూర్వాపరాలు పరిశీలించిన అధికారులు బుధవారం ప్రహరీ తొలగించి, దళితవాడకు సంబంధించిన దారిని పునరుద్ధరించారు. శామీర్‌పేట్ మండలం తూంకుంట మున్సిపాలిటీలోని దేవరయాంజాల్‌లో ఇది చోటు చేసుకుంది. ఒకప్పుడు ఈ దళితవాడకు వెళ్లేందుకు నలువైపుల నుంచి దారి ఉండేది. అక్కడ 1985లో తిరుమల కాలనీ పేరుతో ఓ వెంచర్ వచ్చింది. వీరు ఆ దారులు మూసేయడంతో దళితవాడకు చెందిన వారంతా కేవలం చిన్న బాటకు పరిమితమయ్యారు. దీనిపై వాళ్లు గతంలో పలుమార్లు వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులను కలిసి విన్నవించినా ఫలితం దక్కలేదు. దీంతో ఈ నెల 17న హైడ్రా ప్రజావాణిలో కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. 2022 ఫిబ్రవరిలో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేశారు. ఆ కమిషన్ ఆదేశాలను హైడ్రా దృష్టికి తీసుకువెళ్లారు. తమ ప్రాంతానికి దారులు మూసుకుపోవడంతో కనీసం అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్లు కూడా రాలేని పరిస్థితి ఏర్పడిందని, తాము కూడా చుట్టూ తిరుగుతూ కేవలం ద్విచక్ర వాహనాలపై మాత్రమే రాకపోకలు సాగించగలుగుతున్నామని హైడ్రాకు విన్నవించారు. ఈ ఫిర్యాదుకు కీలక ప్రాధాన్యం ఇచ్చిన కమిషనర్ ఏవీ రంగనాథ్ నిబంధనలు, చట్టపరమైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చివరకు ప్రహరీ తొలగించేలా ఆదేశాలు జారీ చేశారు. దీంతో హైడ్రా సిబ్బంది బుధవారం తిరుమల వెంచర్ నిర్మించిన ప్రహరీని కూల్చేశారు. దీంతో తమ వాడకు దారి దొరికిందని దళితవాడకు చెందిన వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గర్భిణీ స్త్రీలతో పాటు అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారిని తాము బయటకు మోసుకువచ్చి అంబులెన్సు ఎక్కించే వారమని, ఇప్పుడు దారులు తెరుచుకోవడంతో ఉపశమనం లభించినట్లు పేర్కొంటున్నారు.

పులందరివాగు కబ్జా నిజమే



పులందరి వాగును సర్వే చేస్తున్న అధికారులు


వెల్లడించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

ఇబ్రహీంపట్నం రూరల్: పులందరి వాగు కబ్జా నిజమేనని అధికారులు స్పష్టంచేశారు. ‘పూడ్చేస్తాం.. ఆక్రమిస్తాం’ అనే శీర్షికన మంగళవారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. సర్వే చేపట్టాలని ఆదేశించడంతో బుధవారం ఇరిగేషన్, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ అధికారుల బృందం సంయుక్తంగా సర్వే చేసింది. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి ఎంపీపటేల్‌గూడలో పట్టణానికి ఆనుకొని ఉన్న పులందరివాగును నగరానికి చెందిన ఓ బడా వ్యాపారి కాల్వను పూడ్చివేసి, బఫర్‌ను కబ్జా చేసి మట్టి పోసి చదును చేశాడు. ఇదే విషయమై పలుమార్లు మున్సిపాలిటీ అధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. కానీ ఎవరూ పట్టించుకోలేదు. కొద్దిరోజులుగా భారీ ఎత్తున మట్టి పోయడాన్ని ‘సాక్షి’ వెలుగులోకి తెచ్చింది. కలెక్టర్ ఆదేశాలతో ఇబ్రహీంపట్నం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, సర్వేయర్ సాయికృష్ణారెడ్డి, ఆదిబట్ల టౌన్ ప్లానింగ్ అధికారి అబీబ్ ఉన్నీసాబేగం, ఇరిగేషన్ ఏఈ హరితలు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. 500 మీటర్లకు పైగా ఉన్న కాలువను కబ్జా చేసినట్లు గుర్తించారు. కాల్వను కబ్జా చేసిన వారిపై క్రిమినల్ కేసులు పెడతామని తెలిపారు. బఫర్‌తో పాటు కాలువలో పోసిన మట్టిని పూర్తిగా తొలగిస్తామని తెలిపారు. పోలిస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, రెండు రోజుల్లో హద్దులు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ‘సాక్షి’ కథనంతో వాగుకు మోక్షం లభించిందని కితాబిచ్చారు.

కల్వకుర్తి అభివృద్ధే లక్ష్యం

- రూ.250 కోట్లతో బీటీరోడ్లు
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో రూ.250 కోట్లతో బీటీరోడ్ల నిర్మాణం చేపట్టామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. విపక్షాలు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా అభివృద్ధిపైనే తమ దృష్టి అని పేర్కొన్నారు. తలకొండపల్లి మండల పరిధి గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. మండల కేంద్రంలో రూ.15 లక్షలతో సీసీరోడ్లు, మురుగు కాల్వలు, అంతారంలో రూ.15 లక్షలతో సీసీరోడ్లు, వెంకటాపూర్‌లో రూ.25 లక్షలతో సీసీరోడ్లు, మురుగు కాల్వలు, వెల్జాలలో రూ.20 లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీరోడ్ల నిర్మాణ పనులకు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. విద్య, వైద్యం, రవాణా అభివృద్ధికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుందని, ప్రజాపాలన చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు సర్కార్‌పై దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో ఆయా పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పనున్నారని వెల్లడించారు. పీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర నాయకుడు మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అంజయ్య, అజీం, వెంకట్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, నర్సింహ ఉన్నారు.

ఆఖిరి మజిలీలో అండగా..

- సొంతిళ్లు లేక మార్కెట్ యార్డ్ నుంచి అంత్యక్రియలు
- మృతుడి కుటుంబానికి బాసటగా నిలిచిన వ్యాపారులు
- కంటతడి పెట్టించిన నర్సింహారెడ్డి చివరి కార్యం



నర్సింహారెడ్డి (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: అనారోగ్యంతో ఓ వ్యక్తి మరణించగా.. అద్దె ఇంట్లో నిరాకరిస్తారని భావించిన కుటుంబ సభ్యులకు మార్కెట్ యార్డే తావిచ్చింది. ఈ ఆఖరి మజిలీలో మార్కెట్ యార్డు చిరువ్యాపారులే అండగా నిలిచారు. అయ్యో పాపం ఈ దుస్థితి ఎవరికీ రావద్దంటూ అక్కడకు వచ్చిన ప్రతీ ఒక్కరు కంటతడిపెట్టారు. ఈ ఘటన బుధవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో చోటు చేసుకుంది.

సొంతింటి నిర్మాణానికి అప్పులు

మండల పరిధిలోని రాయపోల్ గ్రామానికి చెందిన గుండ్లపల్లి నర్సింహారెడ్డి(60) 40 ఏళ్ల క్రితం ఇబ్రహీంపట్నంలో స్థిరపడ్డాడు. గ్రామంలో ఆస్తులు అమ్ముకున్న ఆయన.. స్థానికంగా కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. సొంతింటి నిర్మాణానికి అప్పులు చేసిన ఆయన, చికెన్ సెంటర్.. ఇతర వ్యాపారాలు చేసినా ఎక్కడా లాభం లేకపోయింది. ఈ క్రమంలో ఆయన మద్యానికి బానిసవడంతో లివర్, కిడ్నీ వ్యాధుల బారిన పడి ఇబ్బంది పడుతున్నారు. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న నర్సింహారెడ్డి బుధవారం కన్నుమూశాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. కుమారుడు సైతం అనారోగ్యంతో ఉన్నాడు.

చిరువ్యాపారుల ఆర్థిక సాయం

నర్సింహారెడ్డికి సొంత ఇళ్లు లేకపోవడంతో మరణ వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు ఆలోచనలో పడ్డారు. మృతుడి భార్యకు స్థానిక మోండా మార్కెట్‌లో కూరగాయల దుకాణం ఉంది. దీంతో అక్కడ అంత్యక్రియలకు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. చివరికి చిరు వ్యాపారులు ఆర్థికసాయంతో అంత్యక్రియలు నిర్వహించారు.

లారీ, ట్రాక్టర్ ఢీ



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ



బోల్తాపడిన ట్రాక్టర్

- ఐదుగురికి గాయాలు
- లారీ ఓవర్‌టేక్ చేయబోతుండగా ఘటన
- మరో ప్రమాదంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

చేవెళ్ల: హైదరాబాద్– బీజాపూర్ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయిన లారీ.. అదుపు తప్పి అదే ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధి ముడిమ్యాల సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి చేవెళ్ల వైపు వస్తున్న లారీ.. ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి.. అదే ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ఎగిరి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రోడ్డు పనులు చేసేందుకు కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్‌లోని.. డ్రైవర్ వెంకన్న, కూలీలు వెంకటేష్, శ్రీను, నవీన్‌లతో పాటు, లారీ డ్రైవర్ భాను ప్రసాద్‌కు స్వల్పగాయలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రులను బయటకు తీసి పోలీసులకు, 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గాయపడిన వారిని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి, పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పి..

మండల పరిధి పామెన బస్‌స్టేజీ సమీపంలో ఓ లారీ అతివేగంగా వస్తూ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం నుంచి చేవెళ్ల మీదుగా షాద్‌నగర్ వైపు మైనింగ్ లోడ్‌తో లారీ వెళ్తోంది. చేవెళ్ల దాటిన తరువాత ముంబయి లింక్ హైవేపై లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న 33/11కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పోల్ విరిగిపోయింది. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. లారీ డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే విద్యుత్ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పోదాం పోలేపల్లి


నేటి నుంచి రేణుకాఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు

సర్వం సిద్ధం చేసిన అధికార యంత్రాంగం

రేపు సీఎం రేవంత్‌రెడ్డి రాక



ముస్తాబైన పోలేపల్లి ఎల్లమ్మ దేవస్థానం



జాతర ప్రాంగణం

బొంరాస్‌పేట: వికారాబాద్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పోలేపల్లి రేణుకా ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు వైభవంగా జరగనున్న జాతరకు ఆలయం ముస్తాబైంది. అమ్మవారి గుడితోపాటు పరశురాముడి గుడి, కోనేరు, ప్రాంగణమంతా రంగులతో కనువిందు చేస్తున్నాయి. జాతరలో ప్రధాన ఘట్టమైన సిడెను వీక్షించేందుకు రాష్ట్రంతో పాటు, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకోనున్నారు. అందుకు తగినట్లు అధికార యంత్రాంగం ఏర్పాట్లను సిద్ధం చేసింది. కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఈసారి ప్రత్యేకం

ఏటా కనుల పండువగా జరిగే పోలేపల్లి ఎల్లమ్మ ఉత్సవాల్లో ఆలయ కమిటీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. రూ.10 లక్షలతో సిడెను, రూ.14 లక్షలతో కొత్త తేరును(రథం) సిద్ధం చేశారు. గురువారం రాత్రి గ్రామవీధుల్లో పల్లకీ సేవ, శుక్రవారం సాయంత్రం జల్దిబోనం, సిడె కార్యక్రమం నిర్వహిస్తారు. రథానికి ఒక పొడవాటి దుంగను కడతారు. దాని చివరన ఒక తొట్టెను ఏర్పాటు చేసి, అందులో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తారు. ఈ సమయంలో పసుపు బండారు భక్తులపైకి విసురుతూ అమ్మవారికి జేజేలు పలుకుతారు. శనివారం సాయంత్రం తేరు, రథోత్సవం, ఆదివారం ప్రత్యేక పూజలు, 24న గ్రామంలో పల్లకీ ఊరేగింపు ఉంటుంది.

హాజరుకానున్న ప్రముఖులు

పోలేపల్లి గ్రామంలో స్వయంభుగా వెలసిన ఎల్లమ్మ మాత జాతరలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి 21న రానున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన సిడెను తిలకించనున్నారు. సీఎం మధ్యాహ్నం తర్వాత దేవస్థానానికి వచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ జయరాములు తెలిపారు. ఇందుకోసం అధికారులు హెలిపాడ్ సిద్ధం చేశారు. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీ డీకే అరుణ, ఎనుముల తిరుపతిరెడ్డి, జిల్లా కలెక్టర్‌తోపాటు ప్రముఖులు దర్శించుకోనున్నారు. భక్తులకు ఆరోగ్యం, భద్రత కోసం వైద్య సిబ్బందితో శిబిరాలు, పోలీసు బందోబస్తుతో ప్రత్యేక నిఘాను ఉంచారు. ఇప్పటికే ఆయా శాఖల అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.



అమ్మవారి సిడె



ఏర్పాట్లు సిద్ధం

రాష్ట్రంలో అతిపెద్ద జాతరైన మేడారం మాదిరిగానే ఇక్కడ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం. సీఎం ప్రత్యేక శ్రద్ధతో ఈసారి జాతరను వైభవంగా నిర్వహిస్తాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాం. మొబైల్ మరుగుదొడ్లు, మూత్రశాలలు, స్నానాల గదులు, తాగునీరు ఏర్పాటు చేశాం. భక్తుల రద్దీకి తగినట్లు అధికారులతో సమన్వయం చేసుకుంటాం.

– జయరాములు, ఆలయ కమిటీ చైర్మన్, పోలేపల్లి దేవస్థానం

హెలిపాడ్ పరిశీలించిన ఎస్పీ

పోలేపల్లి ఎల్లమ్మ జాతరలో పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం ఆయన జాతర ప్రాంగణం, ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తజనానికి సహకరించాలన్నారు. జాతరలో దొంగతనాలు, గొడవలు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా అప్రమత్తతతో మెలగాలని పోలీసు సిబ్బందికి సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాక నైపథ్యంలో హెలిపాడ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ జయరాములు, కమిటీ సభ్యులు, మేనేజర్ రాజేందర్‌రెడ్డి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఆలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

గుర్తు తెలియని వాహనం ఢీ

రైతు మృతి



వెంకట్‌రెడ్డి (ఫైల్)

చేవెళ్ల: పొలం పనులు ముగించుకొని ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న రైతును గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో అతను మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన ప్రకారం.. చేవెళ్ల మండల పరిధి అల్లవాడ గ్రామానికి చెందిన యాలాల పెద్ద వెంకట్‌రెడ్డి(65) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఎప్పటి మాదిరిగానే పొలానికి వెళ్లిన అతను.. రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా గ్రామ బస్‌స్టేజికి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రైతును గుర్తించిన స్థానికులు.. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం పట్నం మహేందర్‌రెడ్డి హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం బుధవారం కుటుంబీకులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మందుల పిచికారీలో జాగ్రత్తలు తప్పనిసరి

మహేశ్వరం: మందుల పిచికారీలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్సెక్టిసైడ్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ జోనల్ మేనేజర్ శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాణిక్యమ్మగూడలో రైతులకు అవగాహన కల్పించారు. మందు స్ప్రే చేసే సమయంలో రక్షణ దుస్తులు, చేతికి గ్లౌజులు, ముక్కు, కళ్లకు రక్షణగా కవచాలను తప్పనిసరిగ్గా ధరించాలన్నారు. మందు పిచికారీ చేసేంత వరకూ నీళ్లు తాగడం, ఆహార పదార్థాలు తినడం, గుట్కాలు నమలడం వంటివి చేయొద్దని తెలిపారు. గ్రామ మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

బిహార్‌వాసి ఆత్మహత్య

పూడూరు: అనుమానాస్పదంగా ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని మృతి చెందిన సంఘటన చన్గోముల్ ఠాణా పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ సత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి పెద్ద ఉమ్మెంతాల్ నుంచి కంకల్ వెళ్లే దారిలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా బిహార్ రాష్ట్రానికి చెందిన చోటు మంజు అని గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్



తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా పత్రాలను అందచేస్తున్న సంస్థ ఇంజనీర్లు

బడంగ్‌పేట్: సిమెంట్ రంగంలో తిరుగులేని శక్తిగా భారతి సిమెంట్ ఎదిగిందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీర్ మహమ్మద్ సాహెర్ తెలిపారు. అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని పేర్కొన్నారు. బాలాపూర్‌లోని నాగార్జున స్టీల్ దుకాణంలోని బుధవారం తాపీ మేస్త్రీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్ వినిమోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని చెప్పారు. కాంక్రీట్ సమయంలో నిపుణులైన సంస్థ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని పేర్కొన్నారు. ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌కు రూ.20 అధికంగా ఉంటుందని వివరించారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాదబీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో డీలర్ శ్రీనివాస్, డిప్యూటీ మార్కెటింగ్ మేనేజర్ రామకృష్ణ, టెక్నికల్ ఆఫీసర్ మహమ్మద్ సాహెర్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గాయపడిన నెమలి



అధికారికి నెమలిని అప్పగిస్తున్న ఉపాధ్యాయుడు

ఇబ్రహీంపట్నం: వీధికుక్కల దాడిలో నెమిలి గాయపడింది. ఈ సంఘటన బుధవారం ఉదయం ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక చెరువు కట్టపై నాలుగైదు కుక్కలు జాతియ పక్షి నెమలిని వెంటాడుతున్నాయి. వాకింగ్‌కు వచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌గౌడ్, మరో ఇద్దరు యువకులు కుక్కల బారి నుంచి నెమలిని కాపాడారు. గాయపడిన నెమలిని చెరదీసి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు వచ్చిన ఆ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డికి నెమలిని అప్పగించారు. అనంతరం స్థానిక పశువైద్యశాలలో మయూరానికి చికిత్స చేయించారు. ప్రాణాపాయస్థితి నుంచి కొలుకున్న పక్షిని సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు, యువకులను అటవీశాఖ అధికారులు అభినందించారు.

కారు ఢీ.. ఒకరి మృతి



ఘటనా స్థలంలో ఇమ్రాన్

మొయినాబాద్: కారు ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మలకపేట్‌కు చెందిన ఇమ్రాన్(40) బండ్లగూడలో టెంట్‌హౌస్ నిర్వహిస్తున్నాడు. బుధవారం మొయినాబాద్‌కు వెళ్లిన ఇమ్రాన్.. తిరిగి వెళ్తూ భోజనం చేయడం కోసం జేబీఐటీ కళాశాల ఎదుట రోడ్డు పక్కన చిన్న హోటల్ సమీపంలో తన కారును ఆపి, నడుచుకుంటూ హోటల్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదే సమయంలో తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అతివేగంతో వచ్చి ఇమ్రాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అయినప్పటికీ.. ఢీకొట్టిన కారు అలాగే ముందుకు దూసుకుపోయి మరో బులెరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ఉన్నవారికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇమ్రాన్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియాకు, స్వల్పగాయాలైనవారిని స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఇమ్రాన్ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చెరువులో పడి వృద్ధురాలి..

కేశంపేట: మతిస్థిమితం లేని వృద్ధురాలు చెరువులో పడి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంజాయి జంగమ్మ(65) గ్రామంలో పాచి పనులు చేసుకుంటూ జీవించేది. గ్రామంలో జరుగుతున్న జాతరకు వెళ్లింది. ఈ క్రమంలో గ్రామ శివారులోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ఉన్న చెరువులో పడి మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు.. విషయం ఆమె కుటుంబ సభ్యులకు తెలిపారు. చెరువులో నుంచి మృతదేహాన్ని బయటికు తీశారు. మృతురాలి కుమారుడు కృష్ణయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ శ్రామిక వర్గానికి వ్యతిరేకంగా ఉందని, దీన్ని సవరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించాలని అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరించి బడ్జెట్‌ను రూపొందించిందన్నారు. పేద ప్రజలకు ఉపయోగం లేకుండా బడ్జెట్‌ను రూపొందించారని ఆయన విమర్శించారు. పెట్టుబడిదారులపై విధించే పన్నును 22శాతం నుంచి 15శాతానికి తగ్గించారన్నారు. పేద మధ్యతరగతుల ప్రజలు ఉపయోగించే వస్తువులపై 200శాతం పన్నులు పెంచుతూ దేశ ప్రజలకు అన్యాయం చేస్తున్నారన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ధనికులపై వారసత్వ పన్ను విధిస్తున్నారన్నారు. కానీ మనదేశంలో ఎందుకు విధించడం లేదని ప్రశ్నించారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సవరించేంత వరకు పోరాటం చేస్తునే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, సత్తయ్య, మహిపాల్‌రెడ్డి, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

పసిడి పతకాల ప్రణవి

తలారి ప్రణవి చిరుతలా పరుగెడుతోంది. బరిలో దిగితే చాలు ఎంతమంది ప్రత్యర్థులున్నా పసిడి పతకాన్ని ఒడిసి పడుతోంది. ఇటీవల కేవలం 12 సెకన్లలోనే 100 మీటర్ల లక్ష్యాన్ని చేరుకుని రాష్ట్రస్థాయి రికార్డు నెలకొల్పింది. మూడేళ్ల కాలంలో జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని సుమారు యాభైకి పైగా స్వర్ణ, కాంస్య పతకాలు సాధించింది. తాజాగా హైదరాబాద్‌లో 11వ రాష్ట్ర యూత్ అథ్లెట్ చాంపియన్‌షిప్ పోటీల్లో ట్రై అథ్లీన్ విభాగంలో పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది.

- చిరుతలా పరుగెడుతున్న గురుకుల విద్యార్థిని
- 12సెకన్లలో 100 మీటర్ల లక్ష్యం చేరుకుని రికార్డ్
- నాలుగేళ్లలో 50కి పైగా బంగారు, కాంస్య పతకాలు
- రాష్ట్ర స్థాయి అండర్– 14 ట్రై అథ్లీన్ విభాగంలో మరో గోల్డ్

బషీరాబాద్: మండల పరిధిలోని మంతట్టి గ్రామానికి చెందిన తలారి సురేష్, శ్రీదేవి దంపతుల రెండో కూతురు ప్రణవి హైదరాబాద్ గచ్చిబౌలి ఎస్సీ గురుకులంలో పదో తరగతి చదువుతోంది. అథ్లెట్ విభాగంలో ఈబాలిక ప్రతిభను గుర్తించిన ప్రిన్సిపాల్ ఆమెను గచ్చిబౌలి స్పోర్ట్స్ అకాడమీలో చేర్పించించారు. ఇండియా అథ్లెటిక్ చీఫ్ హెడ్ కోచ్ నాగ్‌పూరి రమేశ్ వద్ద నాలుగేళ్లుగా శిక్షణ ఇప్పిస్తున్నారు. చదువుతో పాటు రోజు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మరో ఇద్దరు సహాయక కోచ్‌లు నాగరాజ్, షాజి అథ్లెటిక్స్‌లో ఆమెకు మెలకువలు నేర్పిస్తూ రాటుతేల్చారు.



పతకాలతో తలారి ప్రణవి

రన్నింగ్, జంపింగ్ విభాగాల్లో..

వివిధ జిల్లాల్లో జరిగిన అనేక అండర్– 14 జోనల్ పోటీల్లో పాల్గొన్న ప్రణవి చిరుతలా పరుగెడుతూ కేవలం 12 సెకండ్లలో 100 మీటర్ల లక్ష్యాన్ని చేరుకుంంది. ఈ క్రమంలో సీఎం కప్, స్వేరో ఒలింపిక్స్, గురుకులాల అథ్లెటిక్, రాష్ట్ర స్థాయి అథ్లెట్ పోటీల్లో రన్నింగ్, జంపింగ్ విభాగాల్లో బోలెడు బంగారు పతకాలు సాధించింది. రన్నింగ్, జంపింగ్‌లో బోలెడు పసిడి పతకాలు సాధించింది. పాఠశాలలో ఉపాధ్యాయులు, కోచ్‌లు అందరూ ప్రేమగా ప్రణవిని పరుగుల రాణిగా సంబోధిస్తూ జాతీయ అథ్లెటిక్ పోటీలకు సిద్ధం చేస్తున్నారు. ఈనెల 17 నుంచి ఉస్మానియా యునివర్సిటీలో జరుగుతున్న 11వ రాష్ట్ర యూత్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ అండర్– 14లో ట్రై అథ్లీన్ విభాగంలో మరో గోల్డ్ మెడల్ సాధించి సత్తాచాటింది.

ఇంటి నిండా పతకాలే..

ప్రణవికి చిన్ననాటి నుంచి ఆటలు ఎంతో మక్కువ. 5వ తరగతి నుంచే అథ్లెట్ గేమ్స్‌లో పతకాల వేట ప్రారంభించింది. ముఖ్యంగా రన్నింగ్, జంపింగ్‌లో తనకుతానే సాటి అన్నట్లు ప్రతిభ కనబరుస్తోంది. ఇప్పటి వరకు వివిధ స్థాయిల్లో నిర్వహించిన అథ్లెట్ గేమ్స్‌లో 50కి పైగా బంగారు , కాంస్య పతకాలు, చాంపియన్ ట్రోఫీలు సొంతం చేసుకుంది. ఆమెకు వచ్చిన పతకాలు, ప్రశంస పత్రాలతో ఓ గది నిండిపోయిందంటే అతిశయోక్తి కాదు.